ప్రజాశక్తి
శనివారం 9 నవంబర్ 2024 5
శ్రీ సత్యసాయి

బోటింగ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి, ఎమ్మెల్యేలు

పర్యాటక కేంద్రంగా బుక్కపట్నం చెరువు

బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత ఎమ్మెల్యేతో కలిసి చెరువులో బోటింగ్ ప్రారంభం

ప్రజాశక్తి-బుక్కపట్నం

జిల్లాలోనే అతి పెద్దదైన బుక్కపట్నం చెరువును పర్యాటక కేంద్రంగా మార్చేందుకు ప్రభుత్వం ద్వారా అన్ని చర్యలూ తీసుకుంటామని రాష్ట్ర బిసి, చేనేత జౌళి సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో బుక్కపట్నం చెరువులో బోటింగ్‌ను పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డితో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో అభివద్ధి, సంక్షేమాన్ని పరుగులు పెట్టించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనసాగిస్తున్నారని చెప్పారు. సత్యసాయి జిల్లాలో పర్యాటక అభివద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు తెలియజేశారు. జిల్లాలో లేపాక్షి, ప్రశాంతి నిలయం, తిమ్మమ్మ మర్రిమాను సహా ఎన్నో పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని వాటిన్నింటినీ అభివృద్ధి చేస్తామన్నారు. రాయలసీమలో అతిపెద్ద చెరువు అయిన బుక్కపట్నం చెరువును కూడా పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దేందుకు ప్రభుత్వం ద్వారా అన్ని చర్యలూ తీసుకుంటామన్నారు. అందులో భాగంగానే బోటింగ్‌ను ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం 14 సీట్ల కలిగిన బోటుతో పాటు 4 ఫెడరల్ బోట్లు, రిస్కీ బోటు ఒకటి నడుపుతున్నట్లు తెలిపారు. త్వరలో బుక్కపట్నం చెరువు వద్ద ఫుడ్ కోర్టు ఏర్పాటు చేస్తామన్నారు. పర్యాటక రంగం అభివద్ధిలో భాగంగా గొల్లపల్లి రిజర్వాయర్‌లను బోటింగ్ సదుపాయం కల్పించనున్నట్లు వెల్లడించారు. ఈ నెల 23న సత్యసాయి బాబా జయంతిని ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. అంతర్జాతీయ పర్యటక కేంద్రంగా అభివద్ధి చేయడానికి టెంపుల్ టూరిజం సర్క్యూట్ అభివద్ధికి, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు అమలు చేయుచున్నారని తెలిపారు. కదిరి, శ్రీ లక్ష్మీనరసింహస్వామి, యోగి వేమన మెమోరియల్ తిమ్మమ్మ మర్రిమాను, లేపాక్షి, అభివద్ధి చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక ప్రణాళిక అమలు చేయుచున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సువర్ణ, జయకుమార్, రీజినల్ కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, కన్వీనర్ మలిరెడ్డి, సర్పంచి నాగలక్ష్మి రాజు, నాయకులు సామకోటి ఆదినారాయణ, గంగాధర్, మాజీ ఎంపీపీ బాలు, సుబ్బారెడ్డి, సయ్యద్ బాషా, మంజు, సుధీర్, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

స్మార్ట్ షాక్..!



- ఉమ్మడి జిల్లాలో చాపకిందనీరులా స్మార్ట్ మీటర్లు
- ప్రభుత్వ కార్యాలయాల పేరుతో ఏర్పాటు
- ఇప్పటికే పలు ప్రాంతాల్లో బిగించిన విద్యుత్ అధికారులు
- తర్వాత ప్రయివేటు వ్యాపార సముదాయాల వంతు..!
- ప్రీపెయిడ్ విధానం అమల్లోకి వస్తే రీఛార్జి చేస్తేనే విద్యుత్

కూటమి ప్రభుత్వం స్మార్ట్‌గా ప్రజలకు షాకిస్తోంది. ఎన్నికల ముందు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును తీవ్ర స్వరంతో వ్యతిరేకించిన టిడిపి, జనసేన, బిజెపి నాయకులు ఇప్పుడు దాని గురించి నోరుమెదపడం లేదు. పైగా స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఆమోద యోగ్యమైదనంటూ సన్నాయినొక్కులు నొక్కే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే ట్రూ అప్ ఛార్జీల పేరుతో విద్యుత్ భారాలను ప్రజలపై మోపిన ప్రభుత్వం తాజాగా స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు రంగం సిద్ధం చేసింది. ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య సముదాయాల పేరుతో అధికారులు స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఇవి ఏర్పాటు అయితే విద్యుత్ వినియోగానికి ప్రీపెయిడ్ విధానం అమల్లోకి వస్తుంది. ముందస్తుగా రీఛార్జి చేయిస్తేనే ఇంటికి విద్యుత్ వచ్చే అవకాశం ఉంది.

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

గత కొన్ని రోజులుగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియను అధికారులు వేగవంతం చేశారు. గత రెండు నెల క్రితమే శ్రీసత్యసాయి జిల్లా కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలకు స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేశారు. ఇప్పుడు అనంతపురం జిల్లాలో కూడా పలు మండలాల్లో ప్రభుత్వ కార్యాలయాలకు వీటిని ఏర్పాటు చేస్తున్నారు. గురువారం నాడు అనంతపురం జిల్లా పుట్లూరు మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్, గ్రంథాలయం, ఐకెపి, సచివాలయం తదితర వాటికి స్మార్ట్ మీటర్లను బిగించారు. ప్రభుత్వ కార్యాలయాల అనంతరం వీటిని ప్రయివేటు వ్యాపార సముదాయాలు, ఆ తర్వాత గృహాలకు బిగించే అవకాశం కన్పిస్తోంది. ప్రీ పెయిడ్ ఆప్షన్ పేరుతో వీటిని రూపొందించారు. సెల్‌ఫోన్ తరహాలో ముందుగా రీఛార్జి చేసుకుంటేనే విద్యుత్ సరఫరా కావుతుంది. ఒక వేళ ముందస్తుగా రీఛార్జి చేయించుకోకపోతే విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. వీటి ఏర్పాటుపై ప్రజల నుంచి వ్యతిరేకత ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం వారి దృష్టిని మరల్చేందుకు ప్రభుత్వ కార్యాలయాలకు అంటూ స్మార్ట్ మోసానికి తెరలేపినట్లు తెలుస్తోంది. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వల్ల ఏ ప్రాంతంలో ఏ మేరకు విద్యుత్ వినియోగంలో ఉంది.. లోవోల్టేజీ, విద్యుత్ సరఫరాలో అంతరాయం తదితర సమాచారం విద్యుత్ అధికారులకు వెంటనే అందుతుంది. అయితే వీటిని సాకుగా చూపి స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే భవిష్యత్తులో విద్యుత్ భారాలు మరింత ఎక్కువ అయ్యే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రైతుల వ్యతిరేకత

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సూచన మేరకు వైసిపి ప్రభుత్వ హయాంలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియను అప్పటి ప్రభుత్వం తెరపైకి తెచ్చింది. ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో వ్యవసాయ పంపుసెంట్లకు వీటిని ఏర్పాటు చేసేందుకు విద్యుత్ అధికారులు సిద్ధం అయ్యారు. దీనిపై రైతుల్లో పెద్ద ఎత్తున వ్యతిరేకత వ్యక్తం అయ్యింది. సిపిఎం, రైతు సంఘాల ఆధ్వర్యంలో ప్రత్యక్ష ఆందోళనలు చేపట్టి వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయకుండా అడ్డుకున్నారు. అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న టిడిపి సైతం స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించి వాటిని ఏర్పాటు చేస్తే తాము పగలగొడ తామంటూ ప్రకటనలు చేశారు. అధికారంలోకి వచ్చిన ఐదు నెలలకే స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చాపకింద నీరులా విస్తరిస్తున్నా కూటమి నేతలు ఎవరూ నోరు మెదపకపోవడం గమనార్హం.

ప్రభుత్వ కార్యాలయాలకు పెద్ద చిక్కే...

ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ బిల్లుల చెల్లింపు సక్రమంగా జరగడం లేదు. బిల్లుల చెల్లింపులో జాప్యాన్ని నిరసిస్తూ పలు సందర్భాల్లో విద్యుత్ అధికారులు ప్రభుత్వ కార్యాలయాలకు సరఫరాను నిలిపేసిన సందర్భాలూ ఉన్నాయి. ఇలాంటి తరుణంలో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే ఖచ్చితంగా ముందస్తుగా రీఛార్జి చేయించుకోవాల్సి ఉంటుంది. వాడిన తర్వాత బిల్లు కట్టడమే కష్టంగా ఉన్న తరుణంలో ముందస్తుగా కార్యాలయాలకు రీఛార్జి చేయించడం అంటే గగనమే అనుకోవాలి. ముందస్తు రీఛార్జి చేయించకుంటే కార్యాలయాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. తద్వారా ప్రజలు ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉంది.

రీఛార్జి చేయకుంటే విద్యుత్ కట్

స్మార్ట్ మీటర్లు ఏర్పాటు అయితే వినియోగం తర్వాత బిల్లు చెల్లించే విధానం రద్దు అవుతుంది. సెల్‌ఫోన్ల మాదిరి వినియోగించక ముందే ముందస్తుగా రీఛార్జి చేయించుకోవాలి. నెలలో ఎంత విద్యుత్ వినియోగం అవసరం అవుతుందో దానిని బట్టి ముందస్తుగా రీఛార్జి చేయించుకోవాలి. రీఛార్జి మొత్తం పూర్తవగానే వెంటనే విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది.

ఇటీవల అనంతపురం జిల్లా పుట్లూరు మండల పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన స్మార్ట్ మీటర్

గ్రీవెన్స్ అర్జీలను నిర్లక్ష్యం చేయొద్దు : కలెక్టర్

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

వివిధ సమస్యలపై ప్రజా ఫిర్యాదుల వేదికలో ప్రజలు అందించే అర్జీల సమస్యల పరిష్కారంపై ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు వాటిని పరిష్కరించాలని కలెక్టర్ టిఎస్.చేతన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నాడు ధర్మవరం ఆర్డీవో కార్యాలయంలో రెవెన్యూ డివిజన్ అధికారుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలకు సంబంధించి పదేపదే రీఓపెన్ గ్రీవెన్స్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, స్థానిక ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన వినతులు సకాలంలో పరిష్కరించాలన్నారు. దరఖాస్తుదారుడు కోరిన సమస్యకు అనుగుణంగా ఎండార్స్మెంట్‌ను ఇవ్వాలన్నారు. జిల్లాలో 46 సాగునీటి సంఘాలకు సంబంధించి ఓటర్ల జాబితా తయారీ, పోలీస్ స్టేషన్ గుర్తింపు, ప్రచురణ సకాలంలో పూర్తి చేయాలన్నారు. రికార్డు రూములు నిర్వహణ ప్రభుత్వ నిబంధనల మేరకు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. భూ కేటాయింపు ప్రతిపాదనను సకాలంలో పంపుతూ తిరస్కరించిన మ్యూటేషన్లను 15 రోజులకు ఒకసారి ఆడిటింగ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ధర్మవరం ఆర్డీవో మహేష్, డిఎవో కతిన్‌కుప్రా, లక్ష్మీదేవి, ఇన్‌ఛార్జి తహశీల్దార్ సురేష్‌తో పాటు డివిజన్ పరిధిలోని అధికారులు పాల్గొన్నారు.

వాల్మీకులు అన్ని రంగాల్లో ఎదగాలి : 'గుండుమల'

ప్రజాశక్తి-గుడిబండ

వాల్మీకి సామాజికవర్గం ప్రజలు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించి వారు అన్ని రంగా ల్లో ఎదగాలని మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి సూచించారు. పేర్కొన్నారు. గుడిబండలో శుక్రవారం వాల్మీకి విగ్రహ ఏర్పాటు కోసం చేసిన భూమిపూజ కార్యక్రమంలో గుండుమలతో పాటు టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, మండల కన్వీనర్ మద్దనకుంటప్ప తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు వాల్మీకి సామాజిక వర్గం మహిళలు స్థానిక బస్టాండ్ నుంచి జ్యోతులు మోసుకొని పోలీస్ స్టేషన్ వరకూ పురవీధుల గుండా ఊరేగించారు. వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి భూమి పూజ చేశారు. గుండుమల మాట్లాడుతూ అర్ధాంతరంగా ఆగిన గురుకుల పాఠశాల భవన నిర్మాణ పనులను పూర్తి చేసి 6 నెలల్లో అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. జమ్మలబండ నుంచి కెఎన్.పల్లి వరకూ సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని, అందుకోసం శనివారం ఎమ్మెల్యే ఎంఎస్.రాజు స్థలాన్ని పరిశీలిస్తారన్నారు. మడకశిర ప్రాంతంలో గార్మెంట్స్ పరిశ్రమలు నెలకొల్పి ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. చివరగా గుండుమల తిప్పేస్వామి, శ్రీనివాస మూర్తి, టిడిపి మండల కన్వీనర్ మద్దన కుంటప్ప, శివకుమార్, దుర్గేష్‌లను వాల్మీకి సంఘం నాయకులు శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. అనంతరం వారు తుమ్మల మారెమ్మ ఆలయానికి వెళ్లి పూజలు నిర్వహించారు. కార్యక్ర మంలో ఎస్సీ సెల్ అధ్యక్షులు మంజునాథ్, ఎంపిటిసి శశిధర్, నాయకులు లక్ష్మీనరసప్ప, భీమరాజు, బాది పల్లెప్ప, భోజ రాజు, వెంకటేష్, జనసేన నాయకులు మంజునాథ్, వాల్మీకి నాయకులు జనార్ధన్, కరుణాకర్, రమేష్, శ్రీనివాసులు, సన్నీరప్ప, బలరామప్ప, హనుమంతు, రామంజి, రాజన్న, ఈరన్న, శేఖర్, ముద్దిరప్ప, నాగప్ప, తిప్పేస్వామి, మూడ్లప్ప, గోవిందప్ప, నాగఈరన్న సుధాకర్, తిప్పేస్వామి పాల్గొన్నారు.

వాల్మీకి విగ్రహ ఏర్పాటు భూమిపూజలో పాల్గొన్న గుండుమల తిప్పేస్వామి, నాయకులు

భూ సమస్యలకు సత్వర పరిష్కారం

ప్రజాశక్తి-పెనుకొండ

రెవెన్యూ సదస్సుల ద్వారా గ్రామాల్లో భూ సమస్యలకు తక్షణ పరిష్కారం లభిస్తుందని రాష్ట్ర బిసి సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత తెలిపారు. మండలంలోని మునిమడుగు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించిచారు. మంత్రి మాట్లాడుతూ వైసిపి పాలనలో రెవెన్యూ పరంగా ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఆయా సమస్యలను ప్రజల సమక్షంలోనే పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుంద న్నారు. రెవెన్యూ శాఖలో ఆన్‌లైన్ ట్యాంపరింగ్, రికార్డుల తారుమారుపై అధికారులు గ్రామస్థాయిలో ఫిర్యాదులు స్వీకరించి వెంటనే పరిష్కరిస్తారన్నారు. జగన్ ప్రభుత్వంలో ల్యాండ్ టైటిలింగ్‌లో జరిగిన మోసాలపై రైతులకు వివరించి, పట్టాదారు పుస్తకాల్లో తప్పులు ఉంటే సరి చేసుకోవాలని సూచించారు. వైసిపి ప్రభుత్వం రైతు పట్టాదారు పాసుపుస్తకాలపై ముద్రించిన జగన్ ఫొటోలను తొలగించి భూ సర్వేలో జరిగిన తప్పులను సరిచేస్తూ రాజముద్రతో ముద్రించిన కొత్త పట్టాదారు పాసు పుస్తకాలను ఈ ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో ఆనంద్‌కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, తహశీల్దార్ శ్రీధర్, టిడిపి మండల కన్వీనర్ సిద్దయ్య, నాయకులు నారాయణస్వామి, వెంకటరాముడు, శ్రీనివాసులు, లక్ష్మీనారాయణరెడ్డి, సూర్యనారాయణ, నాగరాజు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదును వేగవంతం చేయండి

గోరంట్ల : టిడిపి సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని మంత్రి సవిత పార్టీ శ్రేణులను ఆదేశించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు, నాయకులతో నిర్వహించిన సమావేశం లో మంత్రి పాల్గొని మాట్లాడారు. సమావేశంలో మండల కన్వీనర్ సోమశేఖర్, నాయకులు బాలకృష్ణ చౌదరి, నరేష్, హుసేన్, చంద్ర, మహమ్మద్, సుధాకర్‌రెడ్డి, వెంకటరెడ్డి, కిషోర్, అమర్నాథ్‌రెడ్డి, చంద్రారెడ్డి, శ్రీనివాసులు, జనసేన పార్టీ మండల అధ్యక్షులు సంతోష్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి మండలంలోని సిరిగవాండ్లపల్లి గ్రామం వెళ్లి అనారోగ్యంతో బాధపడుతున్న టిడిపి కార్యకర్త రామాంజనేయులును పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ఆమె వెంట నాయకులు ఆనంద్, వెంకటరాముడు, కిషోర్ రాయల్, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో మంత్రి సవిత

రెవెన్యూ గ్రామ సదస్సులో పజల నుంచి వినతి పత్రాలు స్వీకరిస్తున్న మంత్రి సవిత, ఆర్డీవో ఆనంద్‌కుమార్

టిడిపి కార్యకర్తకు మంత్రి పరామర్శ

గోరంట్ల రూరల్ : మండలంలోని జీనవాండ్లపల్లి గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త ఆంజనేయులు అనారోగ్యంతో చికిత్స పొంది ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలిసి మంత్రి సవిత ఆ గ్రామం వెళ్లి ఆంజనేయులును పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. మంత్రి వెంట టిడిపి మండల కన్వీనర్ సోముశేఖర్, మాజీ సర్పంచి నరేష్, నిమ్మల శ్రీధర్, బాలకృష్ణచౌదరి, బెల్లాలచెరువు చంద్ర, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

సిఎం చంద్రబాబుని కలిసిన టిటిడి సభ్యులు రాజు

ప్రజాశక్తి-మడకశిర

సిఎం చంద్రబాబుని శుక్రవారం విజయవాడలో ఎమ్మెల్యే, టిటిడి సభ్యులు ఎంఎస్.రాజును కలిశారు. రాజు ఇటీవల టిటిడి పాలకమండలి సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా వెంకటేశ్వరస్వామి ప్రతిమను చంద్రబాబుకు అందజేసి శాలువాతో సన్మానించారు. టిటిడిలో స్వామి వారికి సేవ కల్పించడానికి అవకాశం కల్పించిన చంద్రబాబుకు రాజు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

సిఎం చంద్రబాబును కలిసిన టిటిడి సభ్యులు రాజు

23న అగళి చెరువు నీటి సంఘాల ఎన్నికలు

ప్రజాశక్తి-అగళి

అగళితో పాటు మండలంలోని మధూడి, రావుడి ఇరిగేపల్లి, హళ్లికెర, కోడిపల్లి చెరువు నీటి సంఘాలకు ఈ నెల 23వ తేదీ ఎన్నికలు నిర్వహిస్తామని తహశీల్దార్ సుబ్బారావు తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో చెరువులకు సంబంధించిన వ్యవసాయ రైతులు, ఆయకట్టుదారుల జాబితాను శనివారం ఆయా గ్రామ సచివాలయాల్లో ప్రదర్శిస్తామన్నారు. జాబితాపై అభ్యంతరాలు ఉంటే తహశీల్దార్ కార్యాలయంలో తెలపాలని సూచించారు.

సాగుదారులకు పట్టాలు ఇవ్వాలి : వ్యకాసం

ప్రజాశక్తి-రొద్దం

సాగుదారులకు పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని కోగిర గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. అంతకుముందు వ్యకాసం జిల్లా కమిటీ సభ్యులు నారాయణ అధ్యక్షతన కోగిర రెవెన్యూ పొలంలోని సర్వే నంబర్ 669లో ఉన్న ప్రభుత్వ భూమిని 15 ఏళ్లుగా సాగు చేస్తున్న పేదలు స్థానిక బస్టాండ్ సర్కిల్ నుంచి ర్యాలీగా సచివాలయం వద్దకు చేరుకొని నిరసన వ్యక్తం చేశారు. వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ ఈ విషయమై ఇప్పటికే పలుమార్లు రెవెన్యూ అధికారులకు అర్జీలు ఇచ్చినా ఫలితం లేదన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి సాగుదారులకు హద్దుల ఏర్పాటుకు సర్వేకు అనుమతించి హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ నాగేంద్రకు వినతిపత్రం ఇచ్చారు. స్పందించిన తహశీల్దార్ ఉన్నతాధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు పెద్దన్న తెలపారు. కార్యక్రమంలో వ్యకాసం జిల్లా కమిటీ సభ్యులు స్వర్ణలత, భవన నిర్మాణ కార్మిక సంఘం నియోజకవర్గ కన్వీనర్ కొండా వెంకటేశులు, సాగుదారులు రామాంజ నమ్మ, భాగ్యమ్మ, నిర్మల, నరసింహమూర్తి, అంజ నప్ప, నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ నాగేంద్రకు వినతిపత్రం ఇస్తున్న వ్యకాసం నాయకులు, సాగుదారులు

త్రిలింగ దర్శనానికి ప్రత్యేక బస్సు

పెనుకొండ ఆర్టీసీ డిపో మేనేజర్

ప్రజాశక్తి-పెనుకొండ

కార్తీక మాసం సందర్భంగా ప్రతి సోమవారం త్రిలింగ దర్శనం కోసం ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసినట్లు పెనుకొండ ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్.రామసుబ్బయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి సోమవారం పెనుకొండ నుంచి ఉదయం 6 గంటలకు బస్సు బయల్దేరి బుగ్గ రామలింగేశ్వర స్వామి, యాగంటి, మహానంది' దేవాలయాలను దర్శించుకుని అదే రోజు రాత్రికి తిరిగి వస్తుందన్నారు. రానుపోనూ ఛార్జీలు పెద్దలకు రూ. 790, పిల్లలకు రూ. 400 అన్నారు. వివరాలకు 7382862783, 7331140927 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

నేడు సోలార్ ప్లాంట్ ఏర్పాటుపై సమావేశం

ప్రజాశక్తి-మడకశిర

సోలార్ ప్లాంట్ ఏర్పాటుపై శనివారం మండలంలోని బుళ్లసముద్రం పంచాయతీ పరిధిలోని బి.రాయపురం గ్రామంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు టిడిపి మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ తెలిపారు. పట్టణంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సోలార్ ప్లాంట్ ఏర్పాటు కోసం గతంలోనే కంపెనీ ప్రతినిధులు స్థలాన్ని పరిశీలించారని, ప్రభుత్వం కూడా అనుమతి ఇచ్చిందన్నారు. శనివారం బి.రాయపురం గ్రామంలోని కాటమప్ప గుడి వద్ద ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, అధికారులు స్థలాన్ని పరిశీలిస్తారని తెలిపారు.

జమ్మలబండ సమీపంలో స్థల పరిశీలన

గుడిబండ : మండలంలోని జమ్మలబండ సమీపంలోని చాకి సెంటర్ వద్ద సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు శనివారం ఎమ్మెల్యే రాజు, గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, అధికారులు స్థలాన్ని పరిశీలిస్తారని టిడిపి మండల కన్వీనర్ మద్దనకుంటప్ప తెలిపారు. ఎమ్మెల్యే పర్యటనలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-మడకశిర

రొళ్ల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అత్యవసర మరమ్మతుల నేపథ్యంలో శనివారం సబ్‌స్టేషన్ పరిధిలోని రొళ్ల, వట్టేబెట్ట, ఉలికుంట, గుద్దుర్కి, రత్నగిరి, కాకి, దొడ్డేరి, తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోందని విద్యుత్ ఏఈ పి.నిజాముద్దీన్ తెలిపారు.

రొళ్ల ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా షెక్షావలి

ప్రజాశక్తి-మడకశిర



రొళ్ల మండల రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం షెక్షావలి ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. ఇన్‌ఛార్జి తహశీల్దార్‌కు వీఆర్వోలు, టిడిపి నాయకులు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే రొళ్ల తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్‌గా పని చేస్తున్న భాగ్యలక్ష్మి అగళి మండలానికి బదిలీ కావడంతో రొళ్ల కార్యాలయంలో టిడిపి నాయకులు, వీఆర్వోలు, మండల రెవెన్యూ సిబ్బంది ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ ఉద్యోగులకు బదిలీ సహజమన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ దాసిరెడ్డి, నాయకులు బ్యాడిగెర నరసింహమూర్తి, ఆర్ఐ మంజునాథ్, వీఆర్వోలు సురేష్, రంగనాథ్, చిరంజీవి, లక్ష్మీనరసింహప్ప, తదితరులు పాల్గొన్నారు.



ఇన్‌ఛార్జి తహశీల్దార్ షేక్షావలి, డిప్యూటీ తహశీల్దార్ భాగ్యలక్ష్మిని సన్మానిస్తున్న టిడిపి నాయకులు

పంటపొలాల పరిశీలన

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

మండల పరిధిలోని చిగిచెర్ల గ్రామ పరిధిలోని పొలాలను మండల వ్యవసాయ అధికారులు శుక్రవారం పరిశీలించారు. జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సహాయకులు సనావుల్లా, సహాయ వ్యవసాయ సంచాలకులు ధర్మవరం కృష్ణయ్య ,మండల వ్యవసాయ అధికారితో కలిసి చిగిచెర్ల గ్రామంలో రైతుల పొలాలు పరిశీలించారు. గ్రామంలోని రాఘవరెడ్డి చెందిన కంది పంట పొలాన్ని పరిశీలించి చీడ పీడలు ఉనికిని గుర్తించారు. అలాగే రైతులు చిగిచెర్ల ఓబిరెడ్డి, సూర్యనారాయణ రెడ్డి సాగు చేసిన ఆముదం, వేరుశనగ, వరి పంట పొలాలను పరిశీలించి చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ముస్తఫా, విహెచ్ఎ భార్గవ్, డిఆర్‌సి ఎఒ అబ్దుల్ అలీ, లక్ష్మీనారాయణ గ్రామ రైతులు పాల్గొన్నారు.

అక్షరాస్యతను పెంపొందించండి

ప్రజాశక్తి - గాండ్లపెంట

గ్రామాల్లో అక్షరాస్యతను పెంపొందించాలని ఎంపీడీవో వెంకటరామిరెడ్డి, ఎపిఎం సూర్యనారాయణ, ఎంఇఒ కృష్ణనాయక్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉల్లాస్ ప్రోగ్రాం కింద వెలుగు, సచివాలయ సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వయోజన విద్య కన్వీనర్ రవీంద్ర నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అక్షరాస్యత పెంపొందించాలని ఉద్దేశంతోనే మండలంలో సర్వే నిర్వహించిందన్నారు. ఐదు సంవత్సరాల నుంచి 59 సంవత్సరాలు నిండిన వారికి గ్రామాలలో దాదాపు 1300 మంది నిరక్షరాస్యులను గుర్తించామన్నారు. పదిమంది నిరక్షరాస్యులకు ఒక వాలంటీర్‌ను ఎంపిక చేస్తామని వీరు నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చి దిద్దాలని చెప్పారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

ప్రజాశక్తి - తలుపుల

పర్యావరణాన్ని పరిరక్షిద్దామని పర్యావరణ పరిరక్షణ దక్షిణ భారతదేశం కౌన్సిల్ మెంబర్ దేరింగుల గంగరాజు పిలుపునిచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ శాస్త్రవేత్త, రాజయోగి డాక్టర్ భాస్కర్ నాయుడు తనను పర్యావరణ పరిరక్షణ దక్షిణ భారతదేశం కౌన్సిల్ మెంబర్‌గా నియమించారని చెప్పారు. పర్యావరణం పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానని చెప్పారు.

సజావుగా మండలమీట్

ప్రజాశక్తి - తనకల్లు

స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సజావుగా కొనసాగింది. ఎంపిపి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో మండల స్థాయి అధికారులు తమ తమ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ పనులను, పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కౌసల్య, ఎంపీడీవో రెడ్డప్ప, మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

అర్హత పరీక్ష వాయిదా

ప్రజాశక్తి - కదిరి టౌన్

ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత డిఎస్‌సి శిక్షణ కొరకు నిర్వహించాల్సిన అర్హతా పరీక్ష వాయిదా వేసినట్లు కదిరి సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రెడ్డి బాలాజీ తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ కృష్ణ, గుంటూరు, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మోడల్ ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున ఈ నెల 10 న జరగాల్సిన అర్హతా పరీక్షను నిరవధికంగా వాయిదా వేసినట్లు చెప్పారు. తదుపరి పరీక్ష తేదీని త్వరలో తెలియజేస్తామని తెలిపారు.

నేటి నుంచి ప్రత్యేక ఓటరు నమోదు

ప్రజాశక్తి-హిందూపురం

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 9, 10వ తేదీలో ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ వెంకటేష్ తెలిపారు. హిందూపురం అసెంబ్లీ నియోజక వర్గ పరిధిలోని 253 పోలింగ్ కేంద్రాల్లో ఈ ఓటర్ నమోదు కార్యక్రమం జరుగుతుందన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ ,యువకులు కొత్తగా ఓటర్ నమోదు చేసుకునేందుకు ఫారం-6 అందజేయాల్సి ఉంటుందన్నారు. అదే విధంగా ఓటరు జాబితాలో పేరు ఉండి మరణించిన వ్యక్తులను తొలగించేందుకు ఫారం-7, ఇప్పటికే ఓటరు జాబితాలో పేర్లు ఉండి సవరణల కోసం, అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఒక పోలింగ్ కేంద్రం నుండి మరో పోలింగ్ కేంద్రానికి పేరు మార్చుకునేందుకు ఫారం-8 అందచేయాల్సి ఉంటుందన్నారు. అసెంబ్లీ నియోజకవర్గంలోని హిందూపురం అర్బన్, రూరల్, చిలమత్తూరు, లేపాక్షి మండలాల్లోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈఆర్వో, ఏఈఆర్‌వోల పర్యవేక్షణలో ఈ ప్రత్యేక శిబిరం జరుగుతుందన్నారు. అదే విధంగా ఈ నెల 23, 24వ తేదీలలో కూడా ఈ ప్రత్యేక శిబిరం జరుగుతుందని తహశీల్దార్ తెలిపారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గ పరిధిలోని యువతీ, యువకులు, ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

ధర్మవరం మున్సిపల్ ఇంజనీరింగ్ అవుట్ సోర్సింగ్ కార్మికుల నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. కార్మికుల ఓటింగ్ పద్ధతిన ఇంజినీరింగ్ సెక్షన్ కార్మికుల అధ్యక్ష కార్యదర్శుల నియామకం జరిగింది. యూనియన్ అధ్యక్షులుగా బొగ్గ నాగరాజు, ఉపాధ్యక్షులుగా అంకే పెద్దన్న, దాసరి సురేష్, కార్యదర్శులుగా జయకృష్ణ, ఎస్.బాబు, కోశాధికారిగా అనీల్ కుమార్,కాటమయ్యను ఎన్నుకున్నారు. వీరితో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కార్మికులు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు అన్ని విధాలా ప్రోత్సాహం

మంత్రి సవిత

చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే, తదితరులు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

చేనేత కార్మికులకు ప్రభుత్వం అన్ని విధాల ప్రోత్సాహం అందిస్తోందని రాష్ట్ర బీసీ సంక్షేమం, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. శుక్రవారం పుట్టపర్తి పట్టణంలోని చిత్రావతి రోడ్డులో చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆప్కో షో రూమ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మంత్రితోపాటు స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, ఆర్డీవో అపర్ణ, ఆప్కో వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఆర్. పావనమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో నూతన జిల్లా ఏర్పడిన తర్వాత మొట్టమొదటిసారిగా సత్యసాయి జిల్లాలో తొలి ఆప్కో షో రూమ్‌ను ప్రారంభించామన్నారు. చేనేత కార్మికులు తయారు చేసిన వస్త్రాలను ప్రజలకు చేరువగా తీసుకెళ్ళే ఉద్దేశంతో ఆప్కో నూతన షోరూమ్ ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలు ధరించాలని పిలుపునిచ్చారు. చేనేత రంగాన్ని అన్ని విధాల అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని తెలిపారు. చేనేత వస్త్రాలకు మంచి మార్కెటింగ్ సదుపాయం కోసం ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని వివరించారు. ఆప్కో షోరూమ్ మేనేజర్లకు విక్రయ అభివృద్ధిలో మెలకువలు నేర్పించుటకు స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమం ద్వారా శిక్షణ ఇప్పించడం జరిగిందన్నారు. గత ఆగస్టులో జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా విజయవాడలో నేషనల్ హ్యాండ్లూమ్ ఎక్స్పో ను ముఖ్యమంత్రి ప్రారంభించారని చెప్పారు. ఆప్కో సంస్థ ఈ ఏడాది అక్టోబర్ వరకు సుమారు రూ.18.36 కోట్లలో సాధారణ విక్రయాలను సాధించిందని గత సంవత్సరం కంటే రూ. 2 కోట్లు ఎక్కువగా అమ్మకాలు జరిగాయనితెలిపారు. అలాగే వివిధ సంక్షేమ శాఖలకు ఆప్కో ద్వారా సరఫరా చేసిన వస్త్రాలు రూ.28.86 కోట్లు కాగా గత సంవత్సరంతో పోలిస్తే ఇది కూడా రూ .12 కోట్లు ఎక్కువగా ఉందని అన్నారు. ప్రజలందరూ ముఖ్యంగా ఉద్యోగులు వారంలో ఒకరోజు చేనేత వస్త్రాలను విధిగా ధరించాలని మంత్రి కోరారు. పుట్టపర్తి ఎమ్మెల్యే సింధూర రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం చేనేత కుటుంబాలకు భరోసా కల్పిస్తోందని చెప్పారు. ధర్మవరం పట్టుచీరలు, పొందూరు ఖద్దరు, కలంకారీ చీరలు తదితర వస్త్రాలు దేశంలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో ఎంతో ప్రసిద్ధి గాంచినట్లు తెలిపారు. నేడు ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పుట్టపర్తి ప్రధాన కేంద్రంలో ఆప్కో షోరూమ్ లోప్రారంభించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ఆప్కో షోరూం ల ద్వారా ఆన్లైన్ అమ్మకాలు కూడా అందుబాటులో ఉంటాయని తెలిపారు. చేనేత కార్మికులకు ఉపాధి కల్పించే క్రమంలో ప్రతి ఒక్కరూ చేనేతకు చేయూతనివ్వాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో ఆప్కో జనరల్ మేనేజర్ నాగేశ్వరరావు, ఏడి రామకృష్ణ, డివిజనల్ మార్కెటింగ్ ఆఫీసర్ మధుబాబు సేల్స్ మేనేజర్ వాణి, డీఎస్పీ విజయ్ కుమార్ నాయకులు రామాంజనేయులు, సామకోటి ఆదినారాయణ, రఫీ, పీసీ గంగన్న, బెస్త చలపతి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భారాన్ని ఉపసంహరించండి : సిపిఎం

జెండా ఆవిష్కరణలో నాయకులు

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

ప్రజలపై వేస్తున్న విద్యుత్‌భారాన్ని ఉపసంహరించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈఎస్ వెంకటేష్, బడా సుబ్బిరెడ్డి, లక్ష్మీనారాయణ, వివి రమణ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని మహమ్మదాబాద్ క్రాస్‌లో శుక్రవారం నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రజలపై విద్యుత్ భారాన్ని ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానానికి విరుద్ధంగా విద్యుత్ ఛార్జీలను 44శాతంపెంచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తూ, దేశ ప్రజలకు ద్రోహం చేస్తోందని అన్నారు. రాజ్యాంగంపై దాడి చేస్తున్న బిజెపి మతోన్మాద శక్తులను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో అంతకుముందున్న టిడిపి ప్రభుత్వం చేసిన తప్పిదాల వల్ల సర్దుబాటు విద్యుత్ ఛార్జీలను పెంచాల్సి వచ్చిందని చెప్పిందని ఇప్పడు టిడిపి ప్రభుత్వం కూడా తాను పెంచిన ఛార్జీలకు వైసిపి ప్రభుత్వమే కారణమని చెబుతోందని తెలిపారు. ఈ రెండు ప్రభుత్వాలు ప్రైవేటు ఉత్పత్తిదారుల నుండి అధిక ధరకు విద్యుత్ కొనుగోలు చేసి ఆభారాన్ని ప్రజలపై మోపుతున్నాయని విమర్శించారు. ప్రపంచబ్యాంకు సిఫార్సులకు అనుగుణంగా విద్యుత్ ప్రైవేటీకరణను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని అన్నారు. 2022-2023 సంవత్సరంలో అధిక ధరలకు ప్రైవేటు విద్యుత్ కంపెనీల నుండి కొన్న విద్యుత్ సర్దుబాటు ఛార్జీల పేరుతో 2024 నవంబరు నుండి 2026 జనవరి వరకు యూనిట్ కు రూ.0.83 పైసలు చొప్పున 15 నెలలపాటు వినియోగదారులు అదనంగా చెల్లించాల్సి వస్తుందని అన్నారు. ఉద్యోగులు కార్మికులు ఈ అదనపు భారాన్ని మోయలేరని, ప్రత్యేకించి అసంఘటిత కార్మికులు, నిరుద్యోగులపై ఈ భారం అత్యధికంగా ఉంటుందని పేర్కొన్నారు. గత వైసిపి ప్రభుత్వం ఎనిమిదిసార్లు విద్యుత్ ఛార్జీలను పెంచి ఎన్నికల్లో ఓడిపోయిందని, టిడిపి కూటమి ప్రభుత్వం దీని నుండి గుణపాఠం నేర్చుకుని వెంటనే పెంచిన ఛార్జీలను ఉపసంహరించాలని కోరారు. సర్దుబాటు ఛార్జీలకు వ్యతిరేకంగా ప్రజలందరూ కలిసి పోరాడకపోతే 2024 - 25 ఆర్థిక సంవత్సరం సర్దుబాటు ఛార్జీలను 2026-27లో అదనంగా మోయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శాఖ సభ్యులు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం మండల కార్యదర్శి గా కుళ్లాయప్ప

సిపిఎం మండల కార్యదర్శిగా కుళ్లాయప్పను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల పరిధిలోని మహ్మదాబాద్ క్రాస్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈఎస్ వెంకటేష్ ,బడా సుబ్బిరెడ్డి, లక్ష్మీనారాయణ, వివి రమణ పాల్గొన్న ఈ సమావేశంలో మండల కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శిగా ఎల్. కుళ్లాయప్పను ఎన్నుకున్నారు.

సత్యసాయి జయంతి వేడుకలకు ప్రత్యేక బస్సులు

జిల్లా ప్రజారవాణాధికారి మధుసూదన్

సమావేశంలో పాల్గొన్న ఆర్టీసీ అధికారులు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

సత్యసాయి జయంతి వేడుకలకు ప్రత్యేక బస్సుసర్వీసులు నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి మధుసూదన్ తెలిపారు. ఈ మేరకు ఆయన తన కార్యాలయంలో జిల్లాలోని డిపోల అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్య సాయి బాబా జయంతి వేడుకలు నవంబర్ 20 నుండి నవంబర్ 24 వరకు జరుగుతాయన్నారు. ఈ నేపథ్యంలో పుట్టపర్తికి హైదరాబాద్, చెన్నై, బెంగుళూరు మరియు విజయవాడ సుదూర ప్రాంతాల నుండి భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈనెల 22, 23, 24 తేదీలలో పుట్టపర్తికి భారీగా తరలి వస్తారన్నారు. ప్రయాణికుల రద్దీకనుగుణంగా తగినంత బస్సులు నడపడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కదిరి, ధర్మవరం, పుట్టపర్తి రైల్వేస్టేషన్ల నుండి ప్రశాంతి నిలయం వరకు భక్తులు చేరుకుంటారన్నారు. రైల్వే స్టేషన్ నుండి ప్రత్యేక బస్సులు నడపాలని డిపో మేనేజర్లకు ఆదేశించారు. అలాగే ప్రతి డిపో మేనేజర్ డ్రైవర్లకు కండక్టర్లకు తగు సూచనలు చేయాలన్నారు. ప్రత్యేక బస్సు బుకింగ్ ఏర్పాటు చేయడం జరిగిందని ప్రతి బస్సులోను 40 మందికి సౌకర్యం కల్పించడం జరుగుతుందని అన్నారు. ముఖ్యంగా పుట్టపర్తి ప్రశాంతి రైల్వే స్టేషన్ నుంచి పుట్టపర్తికి 15 బస్సులు, కొత్తచెరువు పుట్టపర్తి బుక్కపట్నం మీదుగా 15, ధర్మవరం రైల్వే స్టేషన్ నుంచి పుట్టపర్తికి 15, కదిరి నుంచి 10, హిందూపురం నుంచి 10, పెనుకొండ నుంచి 5, అనంతపురం నుంచి 15, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ పట్టణాలకు 5 బస్సులు చొప్పున వంద బస్సు సర్వీసులను నడుపుతున్నట్లు చెప్పారు. ప్రతి డిపో నుండి ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో డిప్యూటీ చీఫ్ మెకానిక్ ఇంజనీర్ రమేష్ బాబు, జిల్లాలోని డిపో మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కదిరి టౌన్

నూతన బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం కదిరి ఆర్టీసీ బస్టాండ్‌లోకదిరి నుండి బెంగుళూరు కు వెళ్లే 5 నూతన బస్సులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం విలీనం పేరుతో ఆర్టీసీని నిర్వీర్యం చేసిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు సిబ్బంది, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - కదిరి టౌన్

తమ గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కదిరి రూరల్ మండలం గంగన్నగారిపల్లి వాసులు కోరారు. ఈ మేరకు వారు తమ సమ్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎంపిడిఒ పోలప్పకు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామంలోని చంద్రన్న కాలనీలో విద్యుత్, తాగునీటి సమస్య నెలకొందన్నారు. దీంతో స్పందించిన ఎంపీడీవో హౌసింగ్, ఇంజనీరింగ్,ఉపాధి అధికారులతో కలసి గ్రామంలోని లేఅవుట్‌ను సందర్శించారు. తాము తమ స్థలాల్లో పునాదులు, గోడలు, మూతల వరకు నిర్మాణాలు చేపట్టామనికాలనీకి ఇంతవరకు నీటి, విద్యుత్ సౌకర్యం లేకపోవటంతో ఇబ్బందులు ఏర్పడి పనులు ముందుకు సాగడం లేదని అధికారులకు వివరించారు. అధికారుల చుట్టూ తిరిగినా తమ సమస్యను ఎవరూ పట్టించుకోలేదని వాపోయారు.కాలనీలో సమస్యను త్వరలో పరిష్కరిస్తామని ఎంపిడిఒ హామీ ఇచ్చారు.

విద్యార్థులకు భద్రత కల్పించాలి : సిఐటియు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు భద్రత ఉండాలని ఈ నేపథ్యంలో ధర్మవరం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శాశ్వత వాచ్‌మెన్లను నియమించాలని సిఐటియు నాయకులు కోరారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిత్రాన్ని మండల విద్యాశాఖ అధికారికి శుక్రవారం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు రమణ, అయూబ్ ఖాన్ మాట్లాడుతూ ధర్మవరం మండలంలోని కొన్ని ప్రభుత్వ పాఠశాలల వద్ద కొంతమంది ఆకతాయిలు, దుండుగులు విద్యార్థులను మాయమాటలు చెప్పి బయటకు తీసుకెళుతూ వారి తల్లిదండ్రులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అన్నారు. ఇందిరమ్మ కాలనీలో ఇటీవల జరిగిన సంఘటనే అందుకు నిదర్శనం అన్నారు, విద్యార్థులకు రక్షణ లేకపోవడంతో కొంతమంది పిల్లల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. అదేవిధంగా గతంలో పట్టణంలోని కొన్ని పాఠశాలల్లో చోరీలు సైతం జరిగాయన్నారు. ఈ నేపథ్యంలో పగలు, రాత్రి సమయాలలో కూడా పాఠశాలల వద్ద శాశ్వత వాచ్‌మెన్లను నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చెట్ల నరికివేతను అరికట్టండి

ప్రజాశక్తి - కొత్తచెరువు

జిల్లావ్యాప్తంగా అక్రమంగా చెట్లు నరికే వారిపే చర్యలు తీసుకోవాలని తరలించే వాహనాలను సీజ్ చేయాలని ప్రముఖ పర్యావరణ వేత్త భాస్కర నాయుడు కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం జిల్లా అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. చిన్న చోరీ జరిగితే వెంటనే సరిదిద్దే పోలీస్ డిపార్ట్‌మెంట్ సమస్త జీవరాసుల ఉనికిని కాపాడే చెట్లను పరిరక్షించే విషయంలో కూడా చొరవ చూపాలని కోరారు. కరువు జిల్లాలో వాల్టా చట్టాన్ని ధిక్కరించి వుడ్ మాఫియా చెట్లను నరికేసి జిల్లాను మరింత కరువులోకి నెట్టుతోందని వాపోయారు. 50 కిలోమీటర్ల దూరంలో గల కర్నాటకలో పుష్కలంగా వర్షాలు కురిస్తే మన ప్రాంతంలో అవగాహన లేకుండా చెట్లను నరికివేయడంతో కరువు ప్రాంతంగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ కల్చర్ అండ్ నేచర్ డెవలప్‌మెంట్ సభ్యులు గంగాధర్, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

తపాలా శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరాలు

ప్రజాశక్తి హిందూపురం

నూతనంగా ఐపిపిబి ఖాతాలను తెరిచేందుకు ఈనెల 15వ తేదీ వరకు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసినట్లు తపాలా శాఖ సూపరిటెండెంట్ విజయ్ కుమార్ పేర్కొన్నారు. ఈ విషయాలపై శుక్రవారం తపాలా శాఖ సూపరిటెండెంట్ విజయ్ కుమార్ తన ఛాంబర్ లో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. తపాలా శాఖ, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా సచివాలయాల్లో ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ ఐపిపిబీ నూతన ఖాతాలను తెరవడం జరుగుతుందన్నారు. ఆధార్ లింకేజింగ్ సులభతరం చేయడానికి ఈనెల 15వ తేదీ వరకు ప్రత్యేక క్యాంపులను ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వం నుంచి అందే సంక్షేమ పథకాలకు సంబంధించిన నిధులను డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ ఫర్ డిబిటి లబ్ధిదారుల కోసం ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. జిల్లా యంత్రాంగం సహకారంతో వార్డు సచివాలయ స్థాయిలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించి నూతన ఖాతాలను తెరవడం, ఇప్పటికే ఉన్న ఖాతాలకు ఆధార్ లింకేజ్ చేయడం లాంటివి నిర్వహిస్తున్నామన్నారు. జిల్లావ్యాప్తంగా 472 తపాలా కార్యాలయాల పరిధిలో 2.4 లక్షల ఖాతాలను ప్రారంభించే విధంగా చర్యలు చేపట్టామన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేరాలు ఘోరాలు

హత్యాయత్నం కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి పట్టణానికి చెందిన హరి ప్రసాద్ అనే వ్యక్తిపై జరిగిన హత్యాయత్నం కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.కదిరి పట్టణం, అయ్యప్ప గుడి వెనకాల వీధిలో నివాసముండే కొండరాసి హరి ప్రసాద్ దీపావళి సందర్భంగా టపాసులు ఇక్కడ కాల్చొద్దని చెప్పిన విషయంపై జరిగిన ఘర్షణలో మురళీకృష్ణ అనే వ్యక్తి హరి ప్రసాద్‌పై ఇటుకు పెళ్ళలతో దాడి చేశాడనానరు. ఈ నెల 3న బాధితుడు కదిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో చేసిన ఫిర్యాదు ఆధారంగా నిందితుడు బాల మురళీకృష్ణను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించడంతో కదిరి సబ్ జైలుకు తరలించామన్నారు. గతంలో పలు కేసులలో నిందితుడిగా ఉన్నందున మురళీకృష్ణ కదలికలపై నిరంతరం పోలీసుల నిఘా ఉంచేందుకు అతనిపై రౌడీ షీట్ నమోదు చేసినట్లు పోలీసులు చెప్పారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - తలుపుల

మండలంలోని ఏటి గంగమ్మ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతుని ముఖం మొత్తం కనిపించడం లేదు. మృతుని కుడి చేతి పైన అంజి అని తెలుగులోనూ, ఇంగ్లీషులోని పచ్చబొట్టు ఉంది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుని వివరాలు ఎవరికైనా తెలిస్తే తలుపుల పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

వృద్ధురాలు ఆత్మహత్యాయత్నం

కాపాడిన పోలీసులు

ప్రజాశక్తి - కొత్తచెరువు

వృద్ధురాలితో మాట్లాడుతున్న పోలీసులు

తీవ్ర మనస్థాపానికి గురైన ఓ వృద్ధురాలు కొత్తచెరువు సమీపంలోని నాగులకణం వద్ద బుక్కపట్నం చెరువులో పడి ఆత్మహత్య చేసుకోవడానికి యత్నించింది. విషయం తెలుసుకున్న పోలీసులు భాస్కర్, మారుతి వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని వృద్ధురాలిని కాపాడారు. వృద్ధురాలు రొద్దం మండలం పెద్ద కోడి పల్లి గ్రామానికి చెందినదిగా గుర్తించారు. తనను కుటుంబ సభ్యులు సక్రమంగా చూసుకోవడం లేదని వేధింపులకు గురి చేస్తున్నారని పెదకోడిపల్లికి చెందిన వృద్ధురాలు గంగమ్మ పోలీసుల వద్ద వాపోయారు. దీంతో ఆమెను పోలీసులు స్టేషన్‌కు తీసుకువచ్చారు. అనంతరం వారి కుటుంబ సభ్యులతో ఫోన్లో మాట్లాడి బస్సులో వారి గ్రామానికి వృద్ధురాలిని పంపించారు.

కర్నాటక మద్యం స్వాధీనం

ప్రజాశక్తి - తనకల్లు

మండల పరిధిలోని చిన్నపల్లిలో తనకల్లు ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం నిర్వహించిన దాడుల్లో కర్నాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. గ్రామానికి చెందిన చెంచుగారి చింతలప్ప అనే వ్యక్తి దగ్గర 96 కర్నాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు సిఐ మారుతీరావు, ఎన్ఫోర్స్‌మెంట్ ఇన్స్‌పెక్టర్ సునంద, ఎస్ఐ జిలానీబాషా తెలిపారు.

మోటార్ల దొంగలకు దేహశుద్ధి

పోలీసులకు అప్పగించిన రైతులు

ప్రజాశక్తి బత్తలపల్లి

రైతులకు పట్టుబడిన నిందితులు

వ్యవసాయ బావుల వద్ద వ్యవసాయ పరికరాలను చోరీ చేస్తున్న ఇద్దరు దొంగలను రైతులు పట్టుకొని పోలీసులకు అప్పగించిన సంఘటన మండల కేంద్రమైన బత్తలపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. రైతులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బత్తలపల్లిలోని జగనన్న లేఅవుట్ కాలనీ సమీపంలో ఓ రైతు గురువారం పొలం వద్ద నీరు పెట్టి సాయంత్రం ఇంటికి చేరుకున్నాడు. అనంతరం పొలం వద్దకు మరోసారి వెళ్లివద్దామని వెళ్లాడు. ఇదే సమయంలో ముగ్గురు దొంగలు కేబుల్ వైర్లను కాల్చుకుంటూ కనిపించారు. వారిని చూసీ చూడనట్లుగా వ్యవహరించి బావి వద్దకు చేరుకున్నాడు. అక్కడ కేబుల్ వైర్లు కత్తిరించింది గమనించి ఇంటికి ఫోన్ చేసి రైతు కుమారునికి సమాచారం అందించారు. ఆలా ఒకరికొకరు రైతులు తోడయ్యారు. వారందరూ దొంగల వద్దకు చేరుకుని వారిని పట్టుకునే ప్రయత్నం చేశారు. ఇద్దరు దొంగలు రైతులకు పట్టుపడగా, మరొకరు తప్పించుకుని పారిపోయాడు. వారికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. వీరు ఒకరు కంబదూరు, మరొకరు వేంపల్లి వాసులుగా చెబుతున్నారు. వీరు బత్తలపల్లి తహశీల్దార్ కార్యాలయం వద్ద గుడారాలు వేసుకుని వ్యాపారాలు చేసుకుంటున్నట్లు గుర్తించారు. పగలు వ్యాపారాలు చేసుకుంటూ, రాత్రి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు రైతులు చెబుతున్నారు. వీరిని తమ అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఇలాంటి వారిని గుర్తించి బత్తలపల్లిలో లేకుండా వారి స్వగ్రామాలకు పంపేలా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు.

పేకాట జూదరులు అరెస్టు

ప్రజాశక్తి-గుడిబండ

మండలంలోని ఆచారిపాళ్యం గ్రామశివారులో నిర్వహిస్తున్న పేకాటస్థావరంపై దాడులు చేసి ఆరుగురు జూదరులను అరెస్టు చేసి, రూ. 52,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు మడకశిర సిఐ రాజకుమార్ తెలిపారు. సిఐ తెలిపిన వివరాలు.. అందిన సమాచారం మేరకు ఎఎస్ఐ చంద్రశేఖర్, సిబ్బందితో వెళ్లి దాడులు చేశారన్నారు. అక్కడ గుడిబండ, రొళ్ల మండలాలకు చెందిన వారే కాకుండా కర్నాటకలోని సరిహద్దు గ్రామాల వారు పేకాట ఆడుతుండగా దాడులు చేసి ఆరుగురిని అరెస్టు చేయగా మరో ఐదుగురు పారిపోయారని తెలిపారు. వారి నుంచి రూ. 52,200 నగదు స్వాధీనం చేసుకొని, మొత్తం 11 మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో మద్యం, పేకాట, తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వృద్ధుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని గోనిమేకలపల్లి గ్రామానికి చెందిన కురుబ అంజనప్ప(65) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. 15 ఏళ్ల క్రితం ప్రమాదవశాత్తూ అంజనప్ప నడుము విరిగింది. దీంతో కట్టే సాయంతో నడిచేవాడు. మద్యానికి బానిసై పింఛను సొమ్ముతో పాటు భార్య కూలి చేసిన డబ్బులు మొత్తం తాగేందుకు ఖర్చు చేసేవాడు. దీనికి తోడు గ్రామంలో పలువురి వద్ద అప్పు చేశాడు. డబ్బుల కోసం తరచూ భార్యతో గొడవపడి ఇవ్వకపోతే చచ్చిపోతానని బెదిరించేవాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం 9 గంటల సమయంలో మద్యం మత్తులో గ్రామ సమీపంలోని డ్రిప్పు పైపుతో ఉరి వేసుకున్నాడు. అటుగా వెళ్లిన గ్రామస్థురాలు ఓబులమ్మ గమనించి సమాచారం ఇవ్వడంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూసేసరికి మృతి చెందాడు.

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి పోరాటాలు : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-హిందూపురం

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ అలుపెరగని పోరాటం చేస్తోందని ఆసంఘం జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి అన్నారు. శుక్రవారం పట్టణంలోని బాలయేసు జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ఎస్ఎఫ్ఐ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బాబావలి మాట్లాడుతు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొస్తున్న విద్యారంగ వ్యతిరేక విధానాలపై రాజీ లేని పోరాటాలు చేస్తున్నామన్నారు. ప్రతి విద్యార్థి ఎస్ఎఫ్ఐలో సభ్యత్వం తీసుకుని విద్యార్థి ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఆఫ్రిద్, హుస్సేన్, మహేష్, హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల వ్యాప్తంగా ప్రతి గ్రామ పంచాయతీలో తేదీల వారీగా గ్రామసభలు నిర్వహిస్తామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ రెడ్డిశేఖర్ సూచించారు. స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం తహశీల్దార్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. అందులో తమ కాలనీలో ఓ వ్యక్తి దౌర్జన్యంగా రోడ్డును ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపట్టారని, రోడ్డులోనే మెట్లు నిర్మించారని, దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని స్థానిక షిరిడి నగర్ వాసులు, పెద్దచెరువును పరిరక్షించాలని గ్రామస్తులు కోరారు. గ్రామసభలో పలువురు వివిధ సమస్యలపై అధికారులకు వినతిపత్రాలు ఇచ్చారు. గ్రామసభలో మండల సర్వేయర్ వినోద్‌కుమార్‌రెడ్డి, వీఆర్వోలు నాగరాజు, రామంజి, రామకృష్ణ, టిడిపి మండల కన్వీనర్ సిద్దలింగప్ప, టౌన్ కన్వీనర్ వడ్డే సూరి, నాయకులు శివ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలో అర్జీలు ఇస్తున్న గ్రామస్తులు

లేపాక్షి : మండలంలోని కోడిపల్లి పంచాయతీ కేంద్రం వద్ద నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో 29 అర్జీలు అందినట్లు తహశీల్దార్ కుమార్‌రెడ్డి తెలిపారు. అందులో రెవెన్యూకి సంబందించిన 14 అర్జీలు, పింఛన్ల కోసం 6, గృహాల కోసం 9 అర్జీలు అందాయి. గ్రామసభలో సర్పంచి మంజునాథ్, ఎంపీటీసీ గంగాధర్, ఆర్ఐ ప్రమీలమ్మ, వీఆర్వో నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల : మండలంలోని గంగంపల్లి గ్రామంలో తహశీల్దార్ మారుతి ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు రెవెన్యూ గ్రామ సదస్సు నిర్వహించారు. తహశీల్దార్ మాట్లాడుతూ భూ సమస్యలు ఏమైనా ఉంటే అధికారుల దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. పలు సమస్యలపై రైతులు వినతులు ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్ఐ సోమశేఖర్, టిడిపి నాయకులు లక్ష్మీనారాయణ, రుద్రప్ప, నరసింహులు, రవీందర్‌రెడ్డి, సూర్యనారాయణ, రామస్వామి, గంగాద్రి, శివప్ప, శ్రీనివాసులు, వాసునాయక్, తదితరులు పాల్గొన్నారు.

మెట్టును సన్మానిస్తున్న వైసిపి నాయకులు

వైసిపి కార్యకర్తలు అధైర్యపడొద్దు : 'మెట్టు'

ప్రజాశక్తి-డి.హీరేహాల్

వైసిపి శ్రేణులు ఏ ఒక్కరూ భయపడొద్దని, పార్టీతో పాటు తాను అండగా ఉంటామని నియోజక వర్గ సమన్వయకర్త మెట్టు గోవింద్‌రెడ్డి భరోసా ఇచ్చారు. ఆయన శుక్రవారం డి.హీరేహాల్‌లో ఎర్రిస్వామి నూతన గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ వైసిపి నాయకులు, కార్య కర్తలు పార్టీ కోసం మనోధైర్యంతో ముందుకెళ్లాలే కానీ వెనకడుగు వేయరాదన్నారు. ఏ ఒక్కరికీ కష్టం వచ్చినా అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసాను ఇచ్చారు. అనంతరం మెట్టు గోవిందరెడ్డిని మండల నాయకులు రహంతుల్లా, సింగాడి జగదీష్, హనుమంతరెడ్డి, శివారెడ్డి, రామకృష్ణ శాలువా, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు వంద్రప్ప, మంజునాథ, తిమ్మారెడ్డి, తదితరు లు పాల్గొన్నారు.

గుండుమలను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

గుండుమలకు సన్మానం

ప్రజాశక్తి-గుడిబండ

మండలంలోని మోరుబాగల్ పంచాయతీ పరిధిలోని వీరజ్జనపల్లి, నాచేపల్లి గ్రామాల్లో టిడిపి నాయకుల గృహ ప్రవేశ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి హాజరయ్యారు. వారిని మాజీ ఎంపిటిసి పురుషోత్తం, మాజీ వైస్ ప్రెసిడెంట్ హనుమంతరాయప్ప, రాజన్న శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, నాయకులు దుర్గేష్, న్యాయవాది శివకుమార్, మంజునాథ్, లక్ష్మీనరసప్ప, భీమరాజు, పురుషోత్తం, సన్నమారప్ప, వెంకటేష్, భోజరాజు, రాజేంద్ర, డాక్టర్ కృష్ణమూర్తి, జాని పాల్గొన్నారు.

రేపు వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - కదిరి అర్బన్

పట్టణంలోని బస్టాండు కూడలిలో ఏర్పాటు చేఇన తొలితరం స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరిస్తున్నట్లు జిల్లా వడియరాజుల సంక్షేమ సంఘం అధ్యక్షులు జె.వి.రమణ, ప్రధాన కార్యదర్శి వెంకటేశు తెలిపారు. ఆసంఘం కదిరి డివిజన్ అధ్యక్షులు మురళి, ప్రధాన కార్యదర్శి సోమశేఖర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పట్టణం లోని బస్టాండ్ కూడలిలో నిర్మించిన వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణ కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ చేతుల మీదుగా జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి రాయలసీమ జిల్లాలోని వడ్డెరల సోదరులందరూ భారీ ఎత్తున హాజరుకావాలని ఆ సంఘం నాయకులు పిలుపునిచ్చారు.

విద్యార్థులకు రక్తపరీక్షలు

ఉరవకొండ : మండల పరిధిలోని రాకెట్ల తండాలో వైద్యాధికారి వెంకటేష్‌నాయక్ ఆధ్వర్యంలో విద్యార్థులకు శుక్రవారం సికెల్ సెల్ అనీమియా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు శేఖర్, సిహెచ్ఒలు భవాని, భారతి, ఎఎన్ఎం పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి : ఎస్‌టియు

ప్రజాశక్తి-అనంతపురం

ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా ఏర్పడిన నూతన కూటమి ప్రభుత్వం 12వ పిఆర్‌సికి సంబంధించిన మధ్యంతర భృతిని ప్రకటించాలని ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు డిమాండ్ చేశారు. శుక్రవారం బ్రహ్మసముద్రం మండలంలోని కోనాపురం, సూగేపల్లి, పాల వెంకటాపురం, బ్రహ్మసముద్రం, ఎర్రడికేర, వెస్ట్ కోడిపల్లె, బొబ్బర్లపల్లి ఎర్రప్పదండి, మాముడూరు తదితర పాఠశాలలో ఎస్‌టియు సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధ్యంతర భృతితోపాటు పురపాలక ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు, జి.పి.ఎఫ్ సౌకర్యం కల్పించాలని, ఆగిన ఇంగ్లీష్ పదోన్నతులను చేపట్టాలని, కెజిబివి ఉపాధ్యాయినులకు ఎంటిఎస్ అమలు చేస్తూ ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న జీవో 117 రద్దు చేయాలని, 3, 4, 5వ తరగతుల విలీనాన్ని రద్దు చేసి ప్రతి తరగతికీ ఉపాధ్యాయుడిని కేటాయించాలన్నారు. ఉన్నత పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంతో పాటు తెలుగు మాధ్యమం కొనసాగించాలని కోరారు. వీటితోపాటు అనేక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మసముద్రం మండలం ఎస్‌టియు బాధ్యులు చంద్రశేఖర్, సీనియర్ నాయకులు ఆనంద్‌రెడ్డి, కృష్ణమూర్తి, మల్లికార్జునగౌడ్, సిపిఎస్ కళ్యాణదుర్గం డివిజనల్ కన్వీనర్ తిప్పేస్వామి, తదితరులు పాల్గొన్నారు.

14న విగ్రహ ప్రతిష్ఠాపన

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం మున్సిపల్ పరిధిలోని ముద్దిరెడ్డిపల్లిలో నూతనంగా నిర్మించిన అయ్యప్ప స్వామి దేవాలయంలో ఈనెల 14వ తేదీన విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. దేవాలయ పునర్నిర్మాణంలో భాగంగా స్వామివారి పంచలోహ విగ్రహాలను ప్రతిష్టించడం జరుగుతుందన్నారు. ఈసందర్భంగా శుక్రవారం ముద్దిరెడ్డిపల్లి భక్తులు విగ్రహాలను ఊరేగించారు. ఈ కార్యక్రమంలో గురు స్వాములు, డీసీ ఆంజనేయులు, పల్లా లక్ష్మి కుమార్, పివి మంజునాథ్, చంద్రమోహన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వ నమోదు

హిందూపురం : తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి డాక్టర్ సురేంద్ర, జిల్లా అధ్యక్షులు అంజినప్ప, ఆ పార్టీ నాయకులు వివరించారు. ఈ మేరకు వారు శుక్రవారం మున్సిపల్ పరిధిలోని ముదిరెడ్డిపల్లిలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పల్లా లక్ష్మి కుమార్, చంద్రమోహన్ యాదవ్, మంచాల మారుతీ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు ఓటరు నమోదు

ప్రజాశక్తి-సోమందేపల్లి

ఓటరు నమోదు కోసం మండల వ్యాప్తంగా ఈ నెల 9, 10, 23, 24 తేదీల్లో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు తహశీల్దార్ రెడ్డిశేఖర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా తేదీల్లో గ్రామాల్లో పోలింగ్ బూత్ సెంటర్లలో బిఎల్ఒలు అందుబాటులో ఉంటారని, నూతన ఓటరు నమోదు, ఓటరు కార్డులో తప్పులు, మార్పులు, చేర్పులు చేస్తారన్నారు. ఈ కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

లేపాక్షి : ఈ నెల 9, 10 తేదీల్లో నిర్వహించే ప్రత్యేక ఓటరు నమోదు క్యాంపుల్లో మండలంలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహశీల్దార్ కుమార్‌రెడ్డి సూచించారు. ఓటరు జాబితా పోలింగ్ స్టేషన్‌లో బిఎల్ఒ వద్ద అందుబాటులో ఉంటుందన్నారు. మృతి చెందిన వారి పేర్లు తొలగిస్తారని తెలిపారు.

మడకశిర : రొళ్ల మండలంలోని ఎం.రాయపురం గ్రామంలో ఇన్‌ఛార్జి తహశీల్దార్ షేక్షావలి ఆధ్వర్యంలో రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యల పరిష్కారంతో భూముల సమస్యల పరిష్కారానికి తమవంతుగా కృషి చేస్తామని తెలిపారు. గ్రామసభలో టిడిపి మండల కన్వీనర్ దాసిరెడ్డి, టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి గురుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యల పరిష్కారానికే రెవెన్యూ గ్రామసభలు

ప్రజాశక్తి - గాండ్లపెంట

రైతుల సమస్యలు పరిష్కరించేందుకే రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నామని తహశీల్దార్ బాబూరావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని గ్రామ సచివాలయంలో రెవెన్యూ గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ రైతులు తమ భూముల సమస్యలు ఉంటే అర్జీలు ద్వారా అందజేయాలని వాటిని పరిశీలించి పరిష్కరిస్తామని చెప్పారు. డిసెంబర్ మూడో తేదీ వరకు గ్రామ సభలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ జాఫర్, ఆర్ఐ అశోక చక్రవర్తి, వీఆర్వోలు డి వెంకటరమణ, బి చంద్రశేఖర్ రెడ్డి, సచివాలయ సర్వేయర్ అసిస్టెంట్లు వేమ ప్రసాద్‌రెడ్డి, జగన్నాథం రెడ్డి, నాగేందర్ నాయక్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : మండలంలోని కానుగమాకుల పల్లి,కంబాలదిన్నె రెవెన్యూ పొలాలకు సంబందించి శుక్రవారం స్థానిక పలగలపల్లిలో రెవెన్యూ గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సంబందిత సమస్యలపై తహశీల్దార్ యూనస్ బాబు రైతులకు అవగాహన కల్పించారు. రైతులు వారి భూ సమస్యలపై వినతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో వీఆర్వోలు, సర్వేయర్లు రైతులు పాల్గొన్నారు.

కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేయండి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని కోరుతూ శుక్రవారం ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుకి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు హనుమంతురాయుడు, నియోజకవర్గ కార్యదర్శి నవీన్, కోశాధికారి పవన్, పట్టణ అధ్యక్షుడు హర్షవర్ధన్, నాయకులు వర్ధన్, మంజు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వాలి

ప్రజాశక్తి-రాయదుర్గం

నియోజకవర్గ వ్యాప్తంగా దరఖాస్తు చేసుకున్న రైతులకు వెంటనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు సరఫరా చేయాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సిపిఐ తాలూకా కార్యదర్శివర్గ సభ్యుడు కొట్రేష్ ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్ కార్యాలయం వద్ద ఏఈ బాలచంద్రకు వినతిపత్రం ఇచ్చారు. కొట్రేష్ మాట్లాడుతూ నియోజకవర్గంలో చాలా మంది రైతులు డిడి చెల్లించి చాలా రోజులైనా ఇంతవరకూ ట్రాన్స్‌ఫార్మర్లు సరఫరా చేయలేదన్నారు. దీంతో రైతులు పంటలు సాగు చేసుకోలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే రైతులకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి దుర్గన్న, ఎపి రైతు సంఘం తాలూకా అధ్యక్షులు నరసింహులు, వ్యవసాయ కార్మిక సంఘం తాలూకా అధ్యక్షులు నాగరాజు, ఎఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి ఆంజనేయులు, ఎఐవైఎఫ్ తాలూకా అధ్యక్షుడు కుమార్‌తేజ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రశంసా పత్రాలు

రాయదుర్గం రూరల్ : పట్టణంలోని కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన భౌతిక శాస్త్రం విద్యార్థులు 30 రోజుల పాటు స్థానిక బళ్లారి రోడ్డులో ఉన్న శ్రీరామకృష్ణ వద్ధాశ్రమంలో వృద్ధులకు వివిధ రకాల పండ్లు అంద జేశారు. వారు నెల రోజుల పాటు చేసిన సేవలకు గుర్తుగా విద్యార్థులకు వృద్ధాశ్రమం మేనేజర్ సురేష్ ప్రశంసాపత్రాలు అందజేశారు. సేవ చేసేందుకు అవకాశం కల్పించిన వృద్ధాశ్రమం యాజమాన్యానికి ప్రిన్సిపల్ రఘురామ్మూర్తి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసులు, అధ్యాప కులు లక్ష్మీనారాయణ, ప్రసాద్, నాగప్ప, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు కోదండరాములు, నారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగికి సన్మానం

ముదిగుబ్బ : మండలంలో ఎంఇఒగా పనిచేస్తూ రిటైర్మెంట్ పొందిన కిరణ్మయిని శుక్రవారం స్థానిక అధికారులు, ఉపాధ్యాయులు సన్మానించారు. కిరణ్మయి మండల అభివృద్ధికి చేసిన సేవలను ఈసందర్భంగా వారు కొనియాడారు. అనంతరం ఆమెను సన్మానించి ఘనంగా వీడ్కోలు పలికారు.